సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 7, సెప్టెంబర్, 2022



సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయం -8

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. దేవరాపల్లిలో సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు



మాతా శిశు మరణాలు అరికట్టాలి

గర్భిణులను సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి మాతా శిశు మరణాలను అరికట్టాలని డీఎంహెచ్‌వో సుజాత అన్నారు. హుకుంపేట ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె మంగళవారం సందర్శించారు. -8



అంతరాష్ట్ర బైకు దొంగల ముఠా అరెస్టు

అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠాలో ముగ్గురిని స్థానిక పోలీసులు అరెస్టు చేసి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. -8

పొలం నవ్వింది



ఒకప్పుడు గంజాయి ఘాటుతో గుప్పుమనే మన్యం మారుమూల ప్రాంతాలు నేడు పచ్చని వరిపైరులతో కళకళలాడుతున్నాయి. జిల్లాలో గత ఏడాది సుమారు ఆరు వేల ఎకరాల్లో గంజాయి మొక్కలను ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసింది. గంజాయి సాగును సమూలంగా అంతమొందించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో గిరి రైతులు వరితోపాటు పండ్ల మొక్కలను పెంచుతున్నారు. పాత జ్ఞాపకాలను తలచుకుని మళ్లీ సంప్రదాయ పంటల సాగు చేపట్టారు. ఇన్నాళ్లకు గంజాయి ఘాటు పీడ వదలడంతో పొలాలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుని హాయిగా నవ్వుతున్నట్టు దర్శనమిస్తున్నాయి.

- ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్







ఒకప్పుడు గంజాయి మొక్కలు పెంచే ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి, ఇతర పంటలు

న్యూస్‌రీల్

మారుమూల గ్రామాల్లో పాఠశాలల ఏర్పాటుకు చర్యలు

- డీఈవో రమేష్



పంతలచింత గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈవో

హుకుంపేట: మారుమూల గ్రామాల్లో పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ తెలిపారు. తమ గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఇటీవల పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పలు గ్రామాల గిరిజనులు వినతులందించారు. ఈ మేరకు తీగలవలస పంచాయతీ పంతలచింత, శోభకోట పంచాయతీ ఈదులగొంది గ్రామాల్లో మంగళవారం డీఈవో పర్యటించారు. పంతలచింతలో గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో కిలోమీటరు దూరం నడిచి తడిగిరి పంచాయతీ ముల్లుమెట్ట పాఠశాలకు తమ పిల్లలు వెళ్లవలసి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి గ్రామంలో పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని డీఈవో హామీ ఇచ్చారు. అనంతరం ఈదులగొంది పాఠశాలను సందర్శించారు. అక్కడ పాఠశాలకు భవనం లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. నూతన భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామచంద్రరావు,విద్యాశాఖ కోఆర్డినేటర్ జయరాజ్, సీఆర్పీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో ప్రాణాంతక వ్యాధులతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఒడిశా కన్సల్టెంట్ డాక్టర్ మహేష్ తెలిపారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు పలు వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. ఇండియా హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నట్టు గుర్తించామన్నారు. ఈ వ్యాధులను సకాలంలో గుర్తించకపోతే ఇతర రోగాలకు గురికావలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన స్థాయిని తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐహెచ్‌సీఐ జిల్లా ఇన్‌చార్జ్ రవీంద్ర బెహన పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు



సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

సాక్షి, పాడేరు : లింగ నిర్ధారణ పరీక్షలు జరపడం చట్టరీత్యా నేరమని, అలాంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు పలు విభాగాల వైద్యాధికారులు, డీఎల్‌పీవో, ఐసీడీఎస్ అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం -1994పై అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ పరీక్షల వల్ల పలు అనార్థాలు జరుగుతున్నాయని, మహిళలపై శారీరక, మానసిక దౌర్జన్యం, ఆత్మహత్యలకు ప్రేరేపించడం, విష ప్రయోగాలు, అగ్నికి ఆహుతి చేయడం వంటి దారుణాలు జరుగుతుండడం బాధాకరమన్నారు. పుట్టబోయేది బిడ్డ ఆడ శిశువు అని తెలుసుకుని గర్భస్రావం చేయించడం హత్యగానే భావించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా పెళ్లయిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్, డీటీసీవో డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు, పీవో డీటీటీ డాక్టర్ భారతీదేవి, జిల్లా ఎక్స్‌టెన్షన్, మీడియా అధికారి ఒ.రవికుమార్, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులను వేధిస్తే ఉపేక్షించేది లేదు



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన డీఆర్‌వో దయానిధి



చెట్టు నీడలో మాకవరం గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్ కుమార్

- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక
- మ్యుటేషన్ దరఖాస్తుల పెండింగ్‌పై ఆగ్రహం

సాక్షి,పాడేరు : మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసిన రైతులను పదేపదే తిప్పుతూ వేధిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ సుమిత్ కుమార్ రెవెన్యూ యంత్రాంగాన్ని హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, వీఆర్‌వోలతో వీడియో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, నోటరీ అఫిడవిట్ లేకుండా సీసీఎల్‌ఏ సూచనల ప్రకారం మ్యుటేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ తహసీల్దార్లు పట్టించుకోకపోవడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాడేరు డివిజన్‌కు సంబంధించి సబ్‌కలెక్టర్ అభిషేక్‌తో మ్యుటేషన్‌పై కలెక్టర్ సమీక్షించారు. 15 మంది వీఆర్‌వోలు మ్యుటేషన్ పనుల్లో నిర్లక్ష్యం వహించడంపై నోటీసులు జారీ చేసినట్టు సబ్ కలెక్టర్ తెలిపారు. సచివాలయాల్లో పింఛన్ దరఖాస్తులు పెండింగ్ ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 22 పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న కొయ్యూరు తహసీల్దార్‌ను కలెక్టర్ వివరణ కోరారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ఉద్యోగుల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సచివాలయ సిబ్బంది యూనిఫాం తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేసిందని, సంబంధిత ఎమ్మెల్యేలతో సచివాలయ అధికారులు, ఉద్యోగులు చర్చించి, చేపట్టాల్సిన పనులను అప్‌లోడ్ చేసి సాంకేతిక, పరిపాలనాపరమైన అనుమతులు పొందాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో బి.దయానిధి, పాడేరు ఐటీడీఏ నుంచి పీవో ఆర్.గోపాలకృష్ణ, రంపచోడవరం ఐటీడీఏ నుంచి పీవో సూరజ్ గనోరే, చింతూరు ఐటీడీఏ నుంచి పీవో రామశేషు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యం అందక ఎవరూ మృతి చెందకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మండలంలో ఆయన మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించి, మందుల నిల్వలపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది,ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో ఉండే గర్భిణులను ప్రసవ తేదీ దగ్గరపడే సమయానికి బర్త్ వెయిటింగ్ కేంద్రానికి తరలించాలని సూచించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నేత,జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోదరుడు జగబంధు కలెక్టర్‌ను కలిసి పీహెచ్‌సీలో సమస్యలను వివరించారు.

నాడు నేడులో జాప్యం సహించను

నాడు-నేడు పనుల్లో ఎటువంటి జాప్యం జరిగినా సహించేది కలెక్టర్ హెచ్చరించారు.మాకవరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.స్థానిక సర్పంచ్ గంగాధర్,గ్రామస్తులతో చెట్టు నీడలోనే కలెక్టర్ సమావేశమయ్యారు.పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. సచివాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని పరిశీలించి, వీఆర్వోకు పలు సూచనలు చేశారు. మాకవరంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.అనంతరం ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో డుడుమ జలాశయాన్ని సందర్శించారు.వనుగుమ్మ పంచాయతీ సంగడ డీఆర్ డిపోను తనిఖీ చేసి రేషన్ సరుకుల పంపిణీపై ఆరా తీశారు.

ప్రాణాలు బలిగొన్న

అతి వేగం

- ఐ.పోలవరం సమీపంలో బస్సు వ్యాన్ ఢీ
- ఒడిశా రాష్ట్రానికి చెందిన తండ్రీ కొడుకుల మృతి
- నలుగురికి తీవ్రగాయాలు
- రంపచోడవరం ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు



నుజ్జయిన వ్యాన్, (ఇన్‌సెట్) ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

రంపచోడవరం/గంగవరం : మితిమీరిన వేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలో పాలకాలువ దరి ప్రమాదకరమైన మలుపు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రంపచోడవరం ఎస్‌ఐ మోహన్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదల్‌పూర్‌లో బయలుదేరిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ ప్రైవేటు బస్సు మారేడుమిల్లి వైపు నుంచి రాజమహేంద్రవరానికి వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం వైపు మితిమీరిన వేగంతో వస్తున్న వ్యాన్.. బస్సును బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి ప్రాంతానికి చెందిన తండ్రీకొడుకులు శ్రీనివాస సర్కార్ (40), బొండమల్లి సర్కార్ (20) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. చింతూరుకు చెందిన వ్యాన్ డ్రైవర్ బత్తుల వినోద్‌తో పాటు మరొకరు గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న ఏఎన్‌ఎం ప్రసన్నతో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సును బలంగా ఢీ కొన్న వ్యాన్ రోడ్డు పక్కనే దూరంగా ఉన్న తుప్పల్లోకి దూసుకుపోయి నుజ్జునుజ్జయింది. మృతదేహాలను పోస్టుమార్టానికి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు.



గాయపడిన ప్రసన్న

కుండపోతగా వర్షం



పాడేరు మండలం కందమామిడి ప్రాంతంలో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు/పెదబయలు : జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, హుకుంపేట, పెదబయలు మండలాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం పడింది. పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో ఏజెన్సీ వాసులు భయాందోళనకు గురయ్యారు. వర్షం కారణంగా లంబసింగి, పాడేరు ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించాయి. వ్యవసాయానికి ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని గిరిజన రైతులు తెలిపారు.

పిడుగుపాటుకు పశువుల కాపరికి గాయాలు

సమీపంలో పిడుగు పడడంతో పెదబయలు మండలం గోమంగి పంచాయతీ ఊబలగరువు గ్రామానికి చెందిన బరడ మాధవరావు(38) గాయపడ్డాడు. అపస్మారకస్థితికి చేరుకున్న అతనిని గోమంగి పీహెచ్‌సీ తీసుకెళ్లి ప్రాథమిక వైద్య సేవల అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించాలి

- శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి



పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి

పెదబయలు: గర్భిణులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని శిశు సంక్షేమశాఖ పీడీ ఎస్.సూర్యలక్ష్మి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహార మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐసీడీఎస్ పీడీ రాజేశ్వరి,హెచ్‌డీసీసీ వెలుగు ఈశ్వర్‌రావు, జిల్లా కోఆర్డినేటర్ రమేష్ నాయుడు,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. గ్రామ సర్పంచులు, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో హుకుంపేట, జి.మాడుగుల మండలాల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, సర్పంచులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని 212 గ్రామ సచివాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. నిర్మాణ పనులకు 2,977 మెట్రిక్ టన్నుల సిమెంట్ అవసరమైతే, 2,300 మెట్రిక్ టన్నుల సిమెంట్ సరఫరా చేసినట్టు చెప్పారు. నేటికి రూ.104 కోట్ల మేరకు బిల్లులను ప్రభుత్వం చెల్లించిందన్నారు. భవన నిర్మాణాలకు సర్పంచులు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ కొండయ్య పడాల్, డీఈలు, హుకుంపేట, జి.మాడుగుల ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంపై దృష్టి సారిస్తే ఉత్తమ ఫలితాలు

విద్యార్థులు లక్ష్యం మీద దృష్టి పెడితే ఉత్తమ ఫలితాలు సాధించి, ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అన్నారు. ఐటీడీఏ అందిస్తున్న ఎస్‌ఐటీ, జేఈఈ, నీట్, లాసెట్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 2022-23 విద్యాసంవత్సరంలో వంద మంది గిరిజన విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామన్నారు.

ఒక్కో విద్యార్థిపై సుమారు రూ.50వేల చొప్పున ఐటీడీఏ నిధులు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. జేఈఈలో 50 మంది, నీట్‌లో 30 మంది, లాసెట్‌లో 20 మందికి శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఐఐటీ, నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ నెల 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఉత్తమ ర్యాంకర్లకు సన్మానం

గత ఏడాది జేఈఈ, నీట్, లాసెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పీవో సత్కరించారు. జేఈఈలో 40 మందికి శిక్షణ ఇస్తే 38 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారు.



సన్మానగ్రహీతలతో ఐటీడీఏ పీవో

ఉపాధ్యాయులకు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం తామర్ల నాగేశ్వరరావు, జిల్లా స్థాయి అవార్డు పొందిన సీహెచ్ బాలకృష్ణను ఐటీడీఏ తరఫున సన్మానించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావు, మారికవలస ప్రిన్సిపాల్ ఎల్.శివ ప్రసాద్, గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జి. కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ పోలీసు అసిస్టెంటు కమాండెంట్ నాయుడు

వై.రామవరం: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామంలో సీఆర్‌పీఎఫ్– డీ42 బెటాలియన్ పోలీసులు మంగళవారం మొక్కలు నాటారు. బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ అధ్యక్షతన అసిస్టెంటు కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని రోడ్ల కిరువైపుల మొక్కలు నాటారు. ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయం

• పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని దేవరాపల్లి పంచాయతీలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లో మెరుగైన పాలన అందుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు, సుపరిపాలన పూర్తిస్థాయిలో అందుతోందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలందుతున్నాయని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చుకుంటున్నారన్నారు. గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, సామాజిక పింఛన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తున్నారన్నారు. దేవరాపల్లి, ఎర్నాబెల్లి గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమం చేపట్టాల్సి ఉన్నప్పటికీ భారీ వర్షం కారణంగా తప్పని పరిస్థితుల్లో వెనదిరిగారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నర్సింగరావు, ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యులు శివరత్నం, బాలయ్య, వైస్ ఎంపీపీలు దేముడు, ఆనంద్, సర్పంచులు బుజ్జిబాబు, కృష్ణారావు, నాగరాజు, కాసులమ్మ, నాగులమ్మ, వీరేంద్ర ప్రసాద్, లోవకుమారి, పుష్పలత, ఎంపీటీసీలు నాగమణి, పోతురాజు కృష్ణ పడాల్, సత్యనారాయణ, రాజులమ్మ, అనూష, పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు లక్ష్మణ్, రవి, నాయకులు చందరరావు, మత్స్యరాజు, ఎంపీడీవో ఉమామహేష్, పీఆర్ జేఈ జ్యోతిబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

స్థలవివాదంపై డీపీవో, డీఎల్‌పీవో విచారణ

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి నడిబొడ్డున గల ఓ స్థలం వివాదంపై డీపీవో ఎస్.నాగేశ్వరనాయక్ (కాకినాడ జిల్లా) డీఎల్‌పీవో జాన్‌మిల్టన్ (రంపచోడవరం డివిజన్) మంగళవారం స్థానిక సచివాలయంలో లోక్ అదాలత్ నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ విచారణ చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. సర్వే నంబర్ 23లో 180 గజాల స్థలంపై వరుసకు అన్నదమ్ములైన ఇరువురి మధ్య నెలకొన్న వివాదం కోర్టులో వుంది. కాగా దానిని లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు ఇరువర్గాల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేయాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు డీపీవో, డీఎల్‌పీవోలు విచారణ నిర్వహించారు. ఇరువర్గాల నుంచి వాంగ్మూలం సేకరించారు. కోర్టుకు సమర్పిస్తామన్నారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన



పోస్టల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న ఐపీవో ఉపేంద్ర

అరకులోయ రూరల్: తపాలా శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐపీవో ఉపేంద్ర అన్నారు. మండల కేంద్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోస్టల్‌శాఖ సేవలపై పోలీసులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తపాల శాఖలో పలు రకాల పొదుపు, బీమా స్కీములు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సుకన్య సమృద్ధి, ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ తదితర స్కీమ్‌లను వివరించారు. ప్రతి ఒక్కరూ పోస్టల్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఎస్ఐ సంతోష్, తపాలా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కశింకోట : మండలంలోని జి.భీమవరం పంచాయతీ పరిధిలో మంగళవారం నగదు ఫణంగా పెట్టి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని అరెస్టు చేశామని ఎస్ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. రూ.8640 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మాతా శిశు మరణాలు నివారించాలి

• డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



హుకుంపేట హాస్పత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి సుజాత

హుకుంపేట: గర్భిణులను సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి మాతాశిశు మరణాలను అరికట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజత అన్నారు. హుకుంపేట ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. బర్త్ హోమ్ వేయిటింగ్ హోమ్ గదులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మాతా శిశు మరణాలు గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, సకాలంలో ఆస్పత్రుల్లో చేర్పించి, సుఖ ప్రసవాలు జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం పొందేందుకు గర్భిణుల వివరాలను ఆర్‌సీహెచ్ తదితర పోర్టర్‌లో నమోదు చేయాలన్నారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విస్తృతంగా వైద్య సేవలందించాలన్నారు. ఈ మేరకు గ్రామస్తులకు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఫీవర్ సర్వేలు సకాలంలో జరపాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది ఇంటింటికి సర్వే చేయాలన్నారు. పాడేరు ఏడీఎంహెచ్‌వో కె.లీలాప్రసాద్, జిల్లా డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరరావు, పీవోడీటీ డాక్టర్ భారతి, స్థానిక వైద్యాధికారి సుమన తదితరులు న్నారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

• ఎస్పీ గౌతమిసాలి

అనకాపల్లిటౌన్ : దిశ పోలీస్ స్టేషన్‌లో ఫ్యామిలీ కేసులను (ఫ్యామిలీ కపుల్ సెంటర్) త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ గౌతమిసాలి చెప్పారు. మంగళవారం రాత్రి దిశ పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుల విషయమై ఆరా తీయడం జరిగిందన్నారు. దిశ యాప్‌ను ఎక్కువగా డౌన్‌లోడ్ చేయించాలని, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈనెల 10వ తేదీన చట్టాలపై నిర్వహించే ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు సహకరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో దిశ స్టేషన్ డీఎస్పీ మళ్ల మహేష్, సీఐ టి.లక్ష్మి, ఎస్ఐలు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర బైకు దొంగల ముఠా అరెస్టు



విలేకరులకు వివరాలు తెలియజేస్తున్న ఏఎస్సార్ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



జి.మాడుగులలో పోలీసులు స్వాధీనం చేసుకొన్న బైక్‌లు

• 12 బైక్‌లు స్వాధీనం

జి.మాడుగుల : అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠాలో ముగ్గురిని స్థానిక పోలీసులు అరెస్టు చేసి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జి.మాడుగులలో పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్, మల్కన్‌గిరి సరిహద్దున ఉండడంతో కొంతమంది దొంగలు తరచూ ఏజెన్సీ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. స్థానిక పోలీసులు జి.కొత్తూరు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానంగా ఉన్న యువకులను పట్టుకొని ప్రశ్నించగా బైక్‌ల దొంగతనం బయటపడిందన్నారు. ఒడిస్సాలోని కోరాపుట్ జిల్లాకు దంగస్కించా పంచాయతీకు చెందిన సుబాలా గలారీ, సుభాష్ గలారి, దసవంత్‌పుట్ పంచాయతీకి చెందిన అబాలబారిక్‌ల వద్ద నుంచి 12 బైక్‌లు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. మరో నిందితుడు బాబుల హరిజన్ పరారీలో ఉన్నాడన్నారు. వీరు ముగ్గురు గతంలో బైక్‌ల దొంగతనం చేసి జైలుశిక్ష అనుభవించి వచ్చినవారేనని ఎస్పీ తెలిపారు. జి.మాడుగుల మండలానికి చెందిన మూడు, అనకాపల్లి జిల్లా మాడుగుల మండలానికి చెందిన మూడు బైక్‌లు, అనంతగిరి రెండు బైక్‌లు, చింతపల్లి రెండు బైక్‌లు, కశింకోటకు చెందిన ఒక బైక్, దుంబ్రిగుడకు చెందిన ఒక బైక్ దొంగతనం జరగ్గా ఇందులో 12 బైక్‌లు రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో చోరీ

• టీవీ, సీసీ కెమెరాల పరికరాలు ఎత్తుకెళ్లిన దొంగలు



చోరీపై విచారణ చేస్తున్న కొత్తకోట పోలీసులు

రావికమతం : కొత్తకోట జూనియర్ కాలేజీలో దొంగలు పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి తాళాలు పగుల గొట్టి కలర్ టీవీతో పాటు విలువైన సీసీ కెమెరాల పరికరాలను ఎత్తుకు పోయారు. కాలేజీ ప్రిన్సిపాల్ సాయికుమార్ కొత్తకోట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.అప్పలనాయుడు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆయన తెలిపిన వివరాలివి. మంగళవారం తెల్లవారు జామున ముగ్గురు ముసుగు ధరించిన వ్యక్తులు కాలేజీలోకి ప్రవేశించి ప్రిన్సిపాల్ రూం, పక్క గది తాళాలు పగులగొట్టారని వాచ్‌మెన్ అయిలు గమనించి కేకలు వేయగా దొంగలు రాళ్లు విసిరారని తెలిపారు. దీంతో వాచ్‌మన్ ప్రిన్సిపాల్ ఇంటికి వెళ్లి ఆయనకు సమాచారం ఇవ్వడంతో ఇద్దరూ వెళ్లి పరిశీలించగా 32 అంగుళాల కలర్ టీవీ, 16 సీసీ కెమేరాల వీడియోలను భద్రపర్చే డీవీఆర్ చోరీకి గురైనట్టు గుర్తించారు. ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

భార్యపై భర్త కర్రతో దాడి

రాజవొమ్మంగి: మండలంలోని కొత్తకింద్ర గ్రామంలో అమ్మగారి ఇంటి వద్ద గల భార్య లక్ష్మీదుర్గపై చాపరాతిపాలెం గ్రామానికి చెందిన భర్త గుమ్మిడి రాజుబాబు కర్రతో దాడి చేశాడు. ఆమెకు తీవ్ర గాయమైంది. ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్ అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల రాజుబాబుపై వరకట్నం, గృహహింస వంటి నేరాలపై కేసు నమోదైంది. కాగా తనపై ఫిర్యాదు ఇచ్చిన భార్య లక్ష్మీ దుర్గపై కక్షకట్టిన రాజుబాబు సోమవారం అమ్మగారి ఇంటి వద్ద ఉన్న లక్ష్మీదుర్గపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దుర్గ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

మాడుగుల రూరల్ : స్థానిక పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్టు ఎస్ఐ పి.దామోదర్‌నాయుడు మంగళవారం రాత్రి తెలిపారు. కె.జె.పురం జంక్షన్‌లో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, బస్సులో ప్రయాణిస్తున్న తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తుల గంజాయి పట్టుబడిందని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్టు వివరించారు.

మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

యలమంచిలి : ఎలాంటి అనుమతులు లేకుండా పరిమితికి మించి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న పట్టణంలోని భవనం వీధికి చెందిన ఏకుల రాజేష్‌కుమార్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్టు పట్టణ ఎస్ఐ అమ్మనరావు తెలిపారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీన పరచుకున్నారు. ముందస్తు సమాచారంతో స్థానిక విజయలక్ష్మి పెట్రోల్ బంకు వద్ద నిందితుడిని తనిఖీ చేయగా మద్యం బాటిళ్ల పట్టుపడ్డాయని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు తెలిపారు.

బాలికపై యువకుడి అత్యాచారయత్నం

• పోక్సో కేసు నమోదు-పరారీలో నిందితుడు

రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి గ్రామంలో ఓ యువకుడు మంగళవారం సాయంకాలం అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. జడ్డంగి ఇన్‌చార్జ్ ఎస్ఐ, రాజవొమ్మంగి ఎస్ఐ గోపీనరేంద్రప్రసాద్ అందజేసిన వివరాలివి. వాతంగి గ్రామానికి చెందిన రెడ్డి లోవరాజు అనే యువకుడు నీటి కోసం ఓ కొండవాగు వద్దకు వచ్చిన 14 ఏళ్ల బాలిక వెంటపడ్డాడు. ఆమెను పొదల్లోకి తీసుకొని వెళ్ళేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో తల్లి అక్కడకు రావడంతో ప్రమాదం తప్పింది. తన కుమార్తె నీటి కోసం వెళ్లి ఇంకా రాలేదని తల్లి వాగు వద్దకు వెళ్లగా అరుపులు వినపడి అటకాయించింది. దీంతో నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కేసును సీఐ రవికుమార్ పర్యవేక్షిస్తున్నారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఫిర్యాదు



ఉబ్బెగుల పాఠశాల వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెగుల, దొరగూడ గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి రావడం లేదని స్థానికులు వైఎస్సార్‌సీపీ నేతలకు తెలియజేశారు. ఉబ్బెగుల, దొరగూడ గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రమేష్, నేతలు మంగళవారం పర్యటించారు. ఉపాధ్యాయులు రాకపోవడంతో తమ పిల్లల విద్యా భవిష్యత్ ఏమిటని నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఆయా పాఠశాలలను నేతలు పరిశీలించగా.. ఉబ్బెగుల పాఠశాలలో బ్లాక్ బోర్డుపై మే నెలలో పాఠశాలకు వేసవి సెలవులు అని రాసి ఉండడం.. ఇప్పటి వరకు ఆ రాతలే దర్శనం ఇవ్వడాన్ని గ్రహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు పాఠశాల పునఃప్రారంభం నుంచి వెళ్లడం లేదని, ఫలితంగా విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంఈవో చెల్లయ్యకు వారు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి ఉబ్బెగుల, దొరగూడ పాఠశాల ఉపాధ్యాయులపై విచారణ నిర్వహించి, తగు చర్యలు తీసుకుంటామని, గతంలో వారి జీతాలు నిలుపుదల చేసిన సందర్భాలున్నాయని ఎంఈవో తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

మాకవరపాలెం : కడుపునొప్పి తాళలేక ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన లాలం నాగబాబు (70) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. విసుగు చెందిన వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఎవరూ లేని సమయం చూసి పురుగు మందు సేవించాడు. అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గమనించిన కుటుంబీకులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రికి నాయీబ్రాహ్మణుల కృతజ్ఞతలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

రాజవొమ్మంగి: కమ్మరిపేటలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మండల నాయీబ్రాహ్మణుల సంఘం సమావేశం జరిగింది. పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక జీవోను ప్రవేశపెట్టి తమకెంతో మేలు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు శ్రీనివాస్, లింగేశ్వరరావు, సూర్యనారాయణ, సూరిబాబు, చంద్రరావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ



గిరిజన రైతులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ నాగమణి

గూడెంకొత్తవీధి: ఆర్.వి.నగర్ సచివాలయంలో 20 మంది గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను జీ.కె.వీధి–2 ఎంపీటీసీ సభ్యురాలు పి.నాగమణి మంగళవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోడు భూములు సాగుచేస్తున్న రైతులకు హక్కు కల్పించడం హర్షణీయమన్నారు. వీఆర్‌వో రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



సూచనలిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: కించుమండ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చదవుతోనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. హెచ్‌ఎం గెన్ను, ఉపాధ్యాయులు అప్పల స్వామి, వెంటేశ్వర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

గంగవరం: ఇ.రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, సర్పంచ్ రామలక్ష్మి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి ఆధ్వర్యంలో పిడతమామిడి పిహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జింకను అడవిలో విడిచిన అధికారులు

రాజవొమ్మంగి: లక్కవరప్పాడు గ్రామంలోని ఓ గిరిజన కుటుంబం చుక్కల జింకను చేరదీసి పెంచుకొంటున్నారు. ఈ విషయం అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో స్థానిక అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొర తన సిబ్బందితో పాటు గ్రామానికి వెళ్లి జింకను స్వాధీనం చేసుకొన్నారు. దానిని మంగళవారం మారేడుమిల్లి అడవుల్లో విడిచిపెట్టామని విలేకరులకు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

జి.మాడుగుల/డుంబ్రిగుడ/సీలేరు: పలు గ్రామాల్లో వినాయకని నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాల నడుమ థింసా నృత్యాలు, బాణాసంచా కాల్పులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. సమీప గెడ్డలలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీలేరులో గణపతి హోమాన్ని నిర్వహించారు. భారీ అన్నసమారాధన జరిగింది.

నిధులు విడుదల చేయాలి

అరకులోయ రూరల్: ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలని బొండం పంచాయతీ కొత్తవలస, జయంతివలస, కొలియగూడ గ్రామల్లో రైతులు మంగళవారం నిరసన తెలిపారు. కాఫీ రైతు సంఘం నాయకుడు బుజ్జిబాబు మాట్లాడుతూ ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. జోషి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు బాలుడి మృతి

అనంతగిరి : పైనంపాడు పంచాయతీ దొండలవలస గ్రామానికి చెందిన కొర్ర దనేరావు(8) అనే బాలుడు సోమవారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందాడు. రాత్రి ఇంట్లో పడుకుని ఉన్న సమయంలో పాము ఆ బాలుడి కాలిపై కాటు వేసింది. దీంతో గట్టిగా కేకలు వేయడంతో కటుంబ సభ్యులు లేచి చూసే సరికి పాము కంట పడింది. దీంతో పామును హతమార్చి, కుమారుడిని తల్లిదండ్రులు అరకు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతిచెందిన బాలుడు బల్లిమామిడి జీపీఎస్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



లోచలిపుట్టులో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, శివారు ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సంతారి పంచాయతీ జెలగలబంద, లోచలిపుట్టు, టిటింగ్‌పుట్టు తదితర గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 360 గడపలను ఎమ్మెల్యే సందర్శించి, ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. నవరత్న పథకాలన్నీ సక్రమంగా అమలవుతున్నాయని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెలగలబంద, టిటింగ్‌పుట్టు గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కోసం విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే త్వరలో రహదారి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. లోచలిపుట్టు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం సంతారి సచివాలయ కేంద్రాన్ని సందర్శించారు. సక్రమంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, వైస్ ఎంపీపీప్రియాంక, ఎంపీడీవో వెంకటరమణ, ఏపీవో లింగమూర్తి, ఏపీఎం కృష్ణారావు, సీడీపీవో బాలచంద్రమణి దేవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సొసైటీ బ్యాంకు చైర్మన్ రామకృష్ణ, ఎంపీటీసీ సుశీల, సర్పంచ్‌లు అప్పలనాయుడు, సొంబ, లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొండబాబు, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, నాయకులు చిన సత్యం, రవిప్రసాద్, మత్స్యరాజు, రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

గూడెంకొత్తవీధి: దేవరాపల్లి, లక్కవరపుపేట పంచాయతీల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో ఉమామహేష్ మంగళవారం సందర్శించారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం తగదన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించి, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ పాపారావు, తదితరులున్నారు.

చింతపల్లిరూరల్: పెదబరడ గ్రామ సచివాలయాన్ని, పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు, చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

వ్యాధుల నివారణకు కృషి

సీలేరు: స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో వైద్యాధికారి మజీద్ మంగళవారం సమావేశం నిర్వహించారు. వ్యాధుల నివారణకు ఆశ కార్యకర్తలు కృషి చేయాలని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని, గర్భిణులు ఆస్పత్రుల్లో ప్రసవాలపై అవగాహన కల్పించాలని సూచించారు. త్రినాథ్, రాజుబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పనులపై ప్రతిపాదనలు



సర్పంచ్‌లు, నేతలతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

కొయ్యూరు: పంచాయతీలలో ప్రాధాన్యత కలిగిన పనులను గుర్తించి ప్రతిపాదనలు అందజేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సర్పంచ్‌లకు స్పష్టం చేశారు. ప్రతీ పంచాయతీకి రూ.20 లక్షలు కేటాయించారని ,వాటికి సంబంధించి చేపట్టాల్సిన పనులపై నివేదికలు ఇవ్వాలన్నారు. నర్సీపట్నంలో కొయ్యూరు మండల సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామసభల ద్వారా పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. ఈ మేరకు సంక్షేమ పథకాలు అమలుపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్‌ల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని చూసి ఓర్వలేక కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటికి తిప్పి కొట్టాలని స్పష్టం చేశారు. ఎంపీటీసీ సభ్యులు, కీలక నాయకులతో త్వరలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్భ నరసింగరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, నాయకులు సత్యనారాయణ, మహిళా విభాగ మండల అధ్యక్షురాలు రాజులమ్మ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



ముంచంగిపుట్టులో జీడి మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సీతమ్మ



కొయ్యూరులో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఎస్‌ఐ, ఏవో



డుంబ్రిగుడలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు, ఎస్‌ఐ సంతోష్‌కుమార్



జి.మాడుగులలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు, తదితరులు

ముంచంగిపుట్టు: సుజనకోట పంచాయతీ వనుగుపుట్టులో ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా గిరిజన రైతుల కు జీడి మొక్కలను ఎంపీపీ అరిసెల సీతమ్మ మంగళవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. పెదగూడ, కర్రిముఖిపుట్టు, జర్జుల, బాబుశాల గ్రామాల్లో అందిస్తున్నట్టు ఏపీవో సూరిబాబు చెప్పారు. నాయకులు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు. కిలగాడ, కించాయిపుట్టు ఆర్‌బీకేల్లో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలు ఏవో మోహన్‌రావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్‌లు శివశంకర్, సుభాష్‌చంద్ర పంపిణీ చేశారు.

కొయ్యూరు: సింగవరం ఆర్‌బీకేలో ఎం.భీమవరం, యూ.చీడిపాలెం, బూదరాళ్ల గ్రామాల రైతులకు రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ బడుగు రమేష్ మంగళవారం పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్నా రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌ఐ రాజారావు, ఏవో కృష్ణవేణి, ఎంపీటీసీ గంగాభవానీ పాల్గొన్నారు

డుంబ్రిగుడ: కించుమండ, కండ్రుం, కితలంగి ఆర్‌బీకేల్లో రైతులకు రాజ్‌మా విత్తనాలను సర్పంచ్‌లు చెల్లమ్మ, సుబ్బారావు, హరి, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పంపిణీ చేశారు. ఎంపీటీలు దేవి, విజయ, నేతలు చిరంజీవి, రఘు, బాబూరావు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పాలమామిడి, సొలభం పంచాయతీల్లో రైతులకు రాజ్‌మా విత్తనాలను సర్పంచ్‌లు రామకృష్ణ, హనుమంతరావు పంపిణీ చేశారు. ఎంపీఈవో కుమారి, ఏఈవో ప్రశాంత్‌కుమార్, ఎంపీటీసీ చిన్నారావు, నాయకులు బాలయ్యదొర, జ్యోతి, కాంచన పాల్గొన్నారు.

సీలేరు: దారకొండ పంచాయతీలో రైతులకు రాజ్‌మా విత్తనాలను సర్పంచ్ రాజు పంపిణీ చేశారు. బుజ్జి, కాసులమ్మ, మహిళా పోలీసు పద్మ తదితరులున్నారు.

అదనపు భూనష్టపరిహారం చెల్లించడం హర్షణీయం



తహసీల్దార్ శ్రీధర్‌తో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీఆర్ పురం: పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంత రైతులకు భూనష్టపరిహారం అదనంగా చెల్లింపునకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగులు తదితరులు చెప్పారు. తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌తో అదనపు పరిహారం చెల్లింపు విషయంపై చర్చించారు. నిర్వాసిత రైతులకు అదనపు పరిహారం విషయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. ఈ మేరకు భూసేకరణ కోసం అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. సర్పంచ్ రామారావు, నాయకులు మురళీ, విజయలక్ష్మి, సర్పంచ్ రామారావు, గౌతమ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎల్‌ఐసీ బీఎం విద్యాసాగర్, ప్రిన్సిపాల్ కృష్ణ, ఏబీఎం శ్రీనివాస్ తదితరులు

గంగవరం: భారతీయ జీవిత బీమా వారోత్సవాల సందర్భంగా స్థానిక పాఠశాలలు, కాలేజీ విద్యార్థులకు పొదుపు–బీమా ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన 36 మందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీఎం విద్యాసాగర్ మాట్లాడుతూ భారతీయ జీవిత బీమా రంగ సంస్థ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జీవిత బీమా వారోత్సవాలను పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏబీఎం శ్రీనివాస్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.కృష్ణ, జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చిన్నాలమ్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

రాజవొమ్మంగి: ప్రతి ఓటరు తమ ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని రాజవొమ్మంగి తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో సుమారు 31వేల మంది ఓటర్లుండగా ఇప్పటి వరకు 36 శాతం మేర ఆధార్‌తో అనుసంధానం పూర్తయ్యిందన్నారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియకు ప్రజాప్రతినిధులు, నాయకులు తమ సిబ్బందికి తోట్పాడు ఇవ్వాలని కోరారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో జరుగాల్సిన వీడియో కాన్ఫరెన్స్‌కు అంతరాయం ఏర్పడిందని ఆయన చెప్పారు. కరెంటు సరఫరా నిలిచిపోయిన వెంటనే బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదన్నారు.

గంగవరం : ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానంపై గ్రామ వలంటీర్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను అవగాహన కలిస్తున్నారు. ఈ మేరకు సచివాలయ కార్యదర్శులు అప్పలకొండ, వెంకన్నదొర, సచివాలయ సిబ్బంది కన్నయ్యదొర, సతీష్, వలంటీర్లు గిరి , శ్రీను తదితరులు ఓటర్లను కలసి ఆధార్ అనుసంధానం చేశారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



ఎంపీటీసీ సభ్యుల సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీవో

గంగవరం: పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసులు గురువారం సమావేశం నిర్వహించారు.రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు తదితర అంశాలపై చర్చించారు. వైస్ ఎంపీపీలు గంగాదేవి, రామతులసి, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, పద్మావతి, వెంకటలక్ష్మి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సున్నంపాడులో గడప గడపకు

మారేడుమిల్లి: మండలంలోని సున్నంపాడు పంచాయతీ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

నేడు లక్ష్మీపురంలో మెగా వైద్య శిబిరం

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. లక్ష్మీపురం, బుంగాపుట్టు, బరడ, బాబుశాల, రంగబయలు తదతర పంచాయతీల్లోని గ్రామాలకు చెందిన గిరిజనులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య సేవలందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు ఎస్‌ఐ రవీంద్ర చెప్పారు.

నేడు మండల సమావేశం

చింతూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవలం అమల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గం.లకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమాచారంతో హాజరు కావాలని ఆయన సూచించారు.

ముంచంగిపుట్టు: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కుమార్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరగనున్న సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొయ్యూరు: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మేరీరోజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలని ఆమె స్పష్టం చేశారు. సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నేడు

గూడెంకొత్తవీధి : మండల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉమామహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పెదవలస, దామనాపల్లి, దుప్పులవాడ సచివాలయాల పరిధిలో వలంటీర్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించినట్టు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురువారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఉద్యోగులతో సమావేశం

చింతపల్లిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆధ్వర్యంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల ఉద్యోగులతో ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్ట ఎంపీడీవో లాలం సీతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీడీవోలు, వీఆర్ ఏఈఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పనులపై పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

క్రీడాకారులకు అభినందనలు

అరకులోయ రూరల్: యూత్ గేమ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్‌లోని పోఖ్రాలో గత నెలలో జరిగిన పోటీల్లో అరకులోయకు గంగరాజు, ప్రదీప్, శ్రీనివాస్, అరుణ్, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్ బ్యాడ్మింటన్, బాక్సింగ్ కేటగిరీలో బంగారు పతకాలు సాధించారు. ఆయా క్రీడాకారులను సీఐటీయూ మండల కార్యదర్శి బాలదేవ్ తదితరులు మంగళవారం అభినందనలు తెలిపారు.

రేపు కంటి వైద్య శిబిరం

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవా సంస్థల మండల కన్వీనర్ పి.వెంకట రమణారెడ్డి తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ వి.సుబ్బలక్ష్మి, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఆర్ఐ ఎ.తాతారావు, పంచాయతీ మధుసూదనరాజుతో కలిసి శిబిరానికి సంబంధించి కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కంటి రోగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులు ఆరోగ్యశ్రీ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కాకినాడ అంజు కంటి ఆస్పత్రి సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనకరాజు, గంగరాజు, నూకరాజు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల వివరాలు సేకరించాలి

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాల్లో భూసేకరణలో నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు సమాచారాన్ని రెవెన్యూ సిబ్బంది సేకరించి, ఈ నెల 8వ తేదీలోగా నివేదించాలని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 ముంపు గ్రామాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

ముమ్మరంగా చెత్త తొలగింపు



రాజవొమ్మంగి: అల్లి కాలువ వద్ద గత కొన్ని రోజులుగా పేరుకొని ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఇటీవల రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేటకు వెళ్లే మార్గంలో రోడ్‌కు ఇరువైపుల చెత్త కుప్పలు పెరిగిపోయాయి. దీనితో పొక్లెయిన్‌తో పాటు నాలుగు ట్రాక్టర్ల సహాయంతో చెత్త తొలగించి దూరంగా డంప్‌యార్డ్‌కు తరలించారు. కారదర్శి మల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

చట్టాలు పక్కాగా అమలు చేయాలి

ముంచంగిపుట్టు: భూబదలాయింపు చట్టాన్ని రెవెన్యూ అధికారులు పక్కాగా అమలు చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియట్ అధ్యక్షుడు రామకృష్ణ, గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ సుభాష్‌చంద్రలు అన్నారు. తహసీల్దార్ నర్సమ్మను వారు మంగళవారం కలిశారు. మండలంలో గిరిజనేతరులు చేపడుతున్న అక్రమ కట్టడాలు, నాసిరకం వస్తువుల విక్రయాలు తదితర అంశాలపై ఫిర్యాదు చేశారు. గిరిజనులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామని, సంతల్లో తనిఖీ చేస్తామన్నారు.

పెత్తనం చలాయిస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలి

వై.రామవరం: ఆదివాసీలపై పెత్తనం చలాయిస్తున్న వలస గిరిజనేతరులపై తగు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చిరెడ్డి తదతరులు కోరారు. ఈ మేరకు కలెక్టర్, ఉన్నతాధికారులకు పంపిన వినతిలో పేర్కొన్నారు. గిరిజనేతరులు నకిలీ ధ్రువపత్రాలు పొంది విద్య, ఉద్యోగాల్లో గిరిజనులకు రావల్సిన సంక్షేమాన్ని హరిస్తున్నారని, అక్రమ కట్టడాలు చేపడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు.

నిత్యావసర సరకుల పంపిణీ



ఎటపాకలో నిత్యాసరాలు అందజేస్తున్న పోలీసులు



దొరగూడలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న వైసీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్ తదితరులు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశాల మేరకు మంగళవారం పర్యటించారు. గ్రామంలో అంత్రాక్స్ వ్యాధి లక్షణాలున్న వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బియ్యం, పప్పులు, నిత్యావసర సరకులు, మెడికేటెడ్ సబ్బులను అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాయకులు సాధురాం, పులిరాజు తదితరులున్నారు.

వరద బాధితులకు..

ఎటపాక: వరద బాధితులకు ఎస్‌బీఐ శాఖాధికారి విజయ్‌కుమార్, కుటుంబీకుల సహకారంతో మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. గౌరీదేవిపట్నం, ఎర్రగుట్ట గ్రామాల్లో బాధితులకు బియ్యం, పప్పులు తదితర సరకులను విజయ్‌కుమార్, సిబ్బంది అందజేశారు. కళ్యాణ్, మనోజ్, కృష్ణ, నరసింగరావు, ఉషా, వెంకటేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వై.రామవరం: ట్రాఫిక్ నిబంధనలపై ఆటో, జీపు తదితర వాహన డ్రైవర్లకు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మంగళవారం అవగాహన కల్పించారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

అడ్డతీగల/మోతుగూడెం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గంగవరం ఎంఈవో మల్లేశ్వరరావు, అడ్డతీగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవులు, కంప్యూటర్ ఆపరేటర్ బుల్లిదొరతో పాటు మోతుగూడెం ఎంపీయూపీఎస్ స్కూల్ సెక్రటరీ మీనా కబ్బారావు ఉత్తమ అవార్డులు దక్కించుకున్నారు. పాడేరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు పొందారు. అవార్డు గ్రహీతలకు ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు అభినందనలు తెలిపారు.